సాక్షి
ప్రకాశం

సోమవారం । 23 । అక్టోబర్ । 2023



సర్వీసులు అదనం

ప్రయాణికుల రద్దీకి తగినట్లు ఆర్టీసీ అదనపు సర్వీసులు నడుపుతోంది. జిల్లాలోని ఐదు డిపోల నుంచి ఆన్‌లైన్‌లో వంద సర్వీసులు అందుబాటులో ఉన్నాయి.

- IIలో..



కరణం వెంకటేష్‌కు పరామర్శ

రోడ్డు ప్రమాదంలో గాయపడి ఒంగోలులోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కరణం వెంకటేష్‌ను ఎంపీ మాగుంటతోపాటు పలువురు పరామర్శించారు.

- IIలో..

గరిష్టం/కనిష్టం
37/26.5

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. చల్లని గాలులు వీస్తాయి. అక్కడక్కడా పొగ మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

విజయ దశమి శుభాకాంక్షలు

ఒంగోలు: చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా భావించే విజయదశమి పండుగను ప్రజలు సుఖ సంతోషాలతో, ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని స్థానిక ఎమ్మెల్యే, మాజీమంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, రాష్ట్ర మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్, ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి, మాజీమంత్రి శిద్దా రాఘవ రావు, టీటీడీ ధర్మకర్తల మండలి సభ్యుడు శిద్దా సుధీర్‌కుమార్ పేర్కొన్నారు. దుర్గామాతను పూజించి అమ్మవారి ఆశీస్సులు పొంది మంచిగా జీవిస్తూ సుఖ శాంతులు, విజయాలు జిల్లా ప్రజానీకం అందరికీ దక్కాలని కోరుకుంటున్నట్లు పేర్కొన్నారు.

మహాదుర్గగా బాలా త్రిపురసుందరీదేవి



త్రిపురాంతకంలో నందివాహనంపై మహాదుర్గ అలంకారంలో బాలాత్రిపురసుందరీదేవి

త్రిపురాంతకం: దసరా శరన్నవరాత్రి మహోత్సవాల సందర్భంగా ఆదివారం దుర్గాష్టమి రోజున నందివాహనంపై మహాదుర్గ అలంకారంలో బాలాత్రిపురసుందరీదేవి దర్శనమిచ్చారు. మంగళ వాయిద్యాలు, వేదమంత్రోచ్ఛరణలతో వాహన సేవ వైభవంగా నిర్వహించారు. సోమవారం మహర్నవమి సందర్భంగా సిద్ధిదాయిని అలంకారంలో అశ్వవాహనంపై అమ్మవారు దర్శనమివ్వనున్నారు.

టీడీపీ నేతలదే నకిలీ దందా

జిల్లాలో సంచలనం సృష్టించిన నకిలీ డాక్యుమెంట్లు, నకిలీ రబ్బరు స్టాంపుల వ్యవహారం టీడీపీ ప్రభుత్వ హయాంలోనే పురుడు పోసుకున్నట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడవుతోంది. 2014 నుంచి 2018లోపే పచ్చ పార్టీ నేతల కనుసన్నల్లోనే ముమ్మరంగా మూడు నకిలీ డాక్యుమెంట్లు...ఆరు రబ్బరు స్టాంపుల చందంగా విరాజిల్లిందని తెలుస్తోంది.

- టీడీపీ ప్రభుత్వ హయాంలోనే మోసాలకు ఆజ్యం
- సీఐడీ సాయం తీసుకోవాలన్న ప్రభుత్వ నిర్ణయంతో టీడీపీ నాయకుల గుండెల్లో దడ
- పలువురు స్టాంపు వెండర్ల సహకారంతో నకిలీ డాక్యుమెంట్లు
- నకిలీల సృష్టికర్తలపై చర్యలు తీసుకోవాలని తొలుత పోలీసులకు చెప్పిందే ఎమ్మెల్యే బాలినేని
- దర్యాప్తులో వేగం పెంచిన సిట్ పోలీస్ అధికారులు



ఒంగోలు సబర్బన్: నకిలీ డాక్యుమెంట్లు, నకిలీ రబ్బరు స్టాంపుల వ్యవహారం టీడీపీ నాయకుల కనుసన్నల్లోనే సాగినట్లు సిట్ దర్యాప్తులో తేలుతోంది. గత ప్రభుత్వ హయాంలోనే ఒంగోలు తహశీల్దార్ కార్యాలయం ప్రధాన కేంద్రంగా చేసుకొని నకిలీలకు తెరలేపారు. టీడీపీకి ప్రధాన నాయకుడి అండదండలతోనే నగరంలో నకిలీ డాక్యుమెంట్లు, స్టాంపుల కుంభకోణానికి ఊపిరిలూదారు. రెవెన్యూ, పోలీస్, ఒంగోలు మున్సిపాలిటీ, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో టీడీపీకి చెందిన స్లీపర్ సెల్స్‌ను ఏర్పాటు చేసుకొని టీడీపీ పెద్దలు వివాదాల్లో ఉన్న భూములు, ఖరీదైన భూములకు చెందిన వారు ఎక్కడైనా దూర ప్రాంతాల్లో ఉన్నవాటిని గుర్తించటం, ఆస్తిదారుడు చనిపోతే వారి వారసుల పేర్లు తెలుసుకొని వీలునామాలు తయారు చేయడం..ఇలా అక్రమార్కులు విచ్చలవిడిగా రెచ్చిపోయారు. కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారం ముసుగులో తక్కువ సమయంలో ఎక్కువ సొమ్ము...కోట్ల రూపాయల్లో సంపాదించటమే ధ్యేయంగా పెట్టుకొని వేలాది కుటుంబాలు వీధినపడేట్లు చేసి వారి ఉసురు పోసుకున్నారు.

ప్రభుత్వ కార్యాలయాలను లక్ష్యంగా చేసుకొని:

టీడీపీ ప్రభుత్వ హయాంలోనే కొందరు ఆ పార్టీ నేతలు పార్టీ ప్రధాన నేతల అండదండలతో ప్రభుత్వ కార్యాలయాలను కేంద్రాలుగా చేసుకొని అక్రమాలకు తెరలేపారు. నకిలీ డాక్యుమెంట్లు తయారు చేయటానికి ప్రధానంగా రిజిస్టర్ట్ స్టాంపు పేపర్లు కావాల్సి ఉంది. అందుకోసం టీడీపీకి చెందిన నాయకురాలు, స్టాంపు వెండర్ అయిన సీహెచ్. వరలక్ష్మి సాయం తీసుకున్నారు. తేదీలు లేకుండా, పేర్లు రాయకుండా పాత తేదీలతో వేలకొలదీ స్టాంపులు అక్రమార్కులకు ఆమె విక్రయించింది. దీంతో నకిలీ వ్యవహారాన్ని నడిపిన ప్రధాన నిందితులు రూ.లక్షల్లో వరలక్ష్మికి ముట్టచెప్పారు. వరలక్ష్మి గత ఎన్నికల్లో ఒంగోలు 29వ డివిజన్‌లో కార్పొరేటర్ అభ్యర్థిగా టీడీపీ తరఫున పోటీచేసి ఓడిపోయింది. ప్రస్తుతం ఆమె పరారీలో ఉంది. ఇక ప్రధాన నిందితుల్లో ఒకరైన మేడికొండూరి విష్ణువర్దన్ గతంలో ఒంగోలులో ఆర్ఐగా పనిచేసిన మామిడిపాలేనికి చెందిన అధికారి వద్ద సహాయకుడిగా పనిచేశాడు. అప్పట్లోనే ఇద్దరు కలిసి నకిలీ పొజిషన్ సర్టిఫికెట్లు, నకిలీ పట్టాలు పదుల సంఖ్యలో తయారు చేసి రూ.లక్షల్లో వెనకేసుకున్నట్లు సమాచారం. ఇక స్టాంపులు తయారు చేయించటంతో పాటు ఫోర్జరీ సంతకాలు చేయటంలో దిట్ట అయిన గొర్రెపాటి రవికుమార్, ఆయన భార్యతో కలిసి దంపతులు గత పది, పదిహేను సంవత్సరాల నుంచి ఇదే వ్యాపకంలో ఉన్నారు. వీరికి ఒంగోలు మున్సిపల్ కార్యాలయం, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం, తహశీల్దార్ కార్యాలయాల నుంచి బర్త్, డెత్, ప్రాపర్ పర్సన్ సర్టిఫికెట్లు, వీలునామాల తయారీ కోసం అన్ని రకాల సమాచారాన్ని ఒంగోలు నగరానికే చెందిన పువ్వాడ శ్యాం ప్రసాద్(శ్యాం) సమకూరుస్తూ ఉంటాడు. పాత తెల్ల కాగితాలు, పాత బాండ్ పేపర్లు, ఖాళీ ఈ-స్టాంపులు, మోడల్ డాక్యుమెంట్లు, డీకే పట్టాలు కూడా తీసుకొచ్చి వీరితో నకిలీ వ్యవహారంలో ముమ్మరంగా పాలుపంచుకున్నట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది.

దర్యాప్తులో వేగం పెంచిన సిట్...

నకిలీల వ్యవహారంలో సిట్ బృందం దర్యాప్తులో వేగం పెంచింది. ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాస రెడ్డి ఈ వ్యవహారాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లటంతో ప్రభుత్వం పెద్దలు సీఐడీ సహకారం తీసుకోవాలని సూచించారు. దీంతో సిట్ బృందం దర్యాప్తులో దూకుడు పెంచింది. ఎస్పీ మలికాగర్గ్ నేతృత్వంలో ఏఎస్పీ(క్రైమ్స్) ఎస్వీ.శ్రీధర్ రావుతో పాటు ఒంగోలు డీఎస్పీ వి.నారాయణ స్వామి రెడ్డి, దర్శి డీఎస్పీ అశోక్ వర్ధన్, ఇతర డీఎస్పీలు, పలువురు సీఐలు, ఎస్సైలతో కూడిన సిట్ బృందం ఇప్పటికే 9 కేసులు నమోదు చేసి 20 మందిని అరెస్ట్ చేసింది. ఇంకా సూత్రధారులు, పాత్రధారుల కోసం వేట సాగిస్తూనే ఉంది.

సీఐడీ సహకారం అనటంతో టీడీపీ నేతల గుండెల్లో రైళ్లు..

నకిలీ డాక్యుమెంట్లు, రబ్బరు స్టాంపుల కేసుకు రాష్ట్ర సీఐడీ విభాగం సహకారం తీసుకోండని రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు చెప్పటంతో టీడీపీ నేతల గుండెల్లో రైళ్లు పరిగెత్తుతున్నాయి. ఒంగోలులో నకిలీ వ్యవహారం వెలుగు చూడటంతో పోలీసు ఉన్నతాధికారులు ఆ కేసుల దర్యాప్తునకు స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ (సిట్) ఏర్పాటు చేశారు. నకిలీల వ్యవహారంలో ఉన్నదంతా టీడీపీ నేతలు, సానుభూతిపరులు కావటంతో ఒంగోలు మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామచర్ల జనార్దన్ ఉలిక్కిపడ్డాడు. అసలే వాళ్ల అధినేత చంద్రబాబు రాజమండ్రి జైల్లో ఉన్నాడు. చంద్రబాబు కోసం చేపడుతున్న నిరసనలకు కేడర్ అంతంత మాత్రంగానే స్పందిస్తోంది.. ఇంతలో ఈ నకిలీ వ్యవహారం పూర్తిగా మన మెడకు ఎక్కడ చుట్టుకుంటుందోనని ఆ వ్యవహారాన్ని అధికార పార్టీ నేతలపైకి నెట్టాలన్న కుయుక్తి పన్నారు. ఆయన పార్టీ అనుచరుల చేత ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాస రెడ్డి, ఆయన తనయుడు ప్రణీత్ రెడ్డితో పాటు వైఎస్సార్‌సీపీ నాయకులపై నెపం వేస్తే అసలు విషయాన్ని పక్కదారి పట్టించవచ్చని రాజకీయ ఎత్తుగడ వేశాడు. అనుకున్నదే తడవుగా అధికార పార్టీ నేతలపై బురద జల్లే కార్యక్రమాన్ని ముమ్మరం చేశాడు.

నకిలీ సూత్రధారులపై చర్యలు తీసుకోవాలని చెప్పిందే బాలినేని

ఒంగోలు నగరంలో వెలుగు చూసిన నకిలీ డాక్యుమెంట్లు, రబ్బరు స్టాంపుల అక్రమాలపై చర్యలు తీసుకోవాలని తొలుత పోలీసులకు చెప్పిందే ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాస రెడ్డి. ఒక ఐఆర్ఎస్ అధికారి ఒంగోలు దక్షిణం బైపాస్ సమీపంలో 60 సెంట్ల భూమి కొనుగోలు చేశాడు. అయితే ఆ భూమికి సంబంధించి ఎవరో నకిలీ డాక్యుమెంట్లు సృష్టించారని తెలియటంతో ఆ విషయం బాలినేని దృష్టికి వచ్చింది. దీంతో తాలూకా పోలీసులకు ఆ నకిలీ డాక్యుమెంట్ వ్యవహారం ఏమిటో తేల్చాలని చెప్పారు. అంతే తీగలాగితే డొంక కదిలినట్లు పెద్ద నకిలీల రాకెట్టే బయటపడింది. ఆ విషయం బాలినేని దృష్టికి రాగానే ఆ నకిలీ వ్యవహారంలో అధికార వైఎస్సార్‌సీపీకి చెందిన వారు ఉన్నా...లేక తన అనుచరులు ఉన్నా సరే కేసులు నమోదు చేసి చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేయాలని స్పష్టంగా చెప్పారు. ఈ విషయాన్ని నేరుగా మీడియాకు కూడా చెప్పారు.. కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్, ఎస్పీ మలికాగర్గ్‌లకు కూడా స్పష్టం చేశారు. అయినా కేసు దర్యాప్తులో కొంత జాప్యం జరిగేసరికి భుజాలు తడుముకున్న టీడీపీ నాయకులు నకిలీ వ్యవహారంలో టీడీపీ నేతల పేర్లు రాకముందే అధికార పార్టీపై బురదజల్లే కార్యక్రమానికి తెరలేపారు.

వలంటీర్ల ఎంపికకు నోటిఫికేషన్

ఒంగోలు సబర్బన్: జిల్లాలోని ఒంగోలు నగర పాలక సంస్థతో పాటు మార్కాపురం మున్సిపాలిటీ, గిద్దలూరు, కనిగిరి నగర పంచాయతీల్లో ఖాళీ అయిన వార్డు వలంటీర్ల నియామకానికి నోటిఫికేషన్ జారీ చేశారు. ఈ మేరకు ఒంగోలు నగర కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు ఆదివారం మీడియాకు వివరాలు వెల్లడించారు. అర్హులైన నిరుద్యోగ యువతీ, యువకుల నుంచి ఈ నెల 26వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానించారు. వలంటీర్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవటానికి అర్హతలు పదో తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి ఉండాలి. వార్డు వలంటీర్‌గా ఏ పట్టణంలో ఆశిస్తారో ఆ పట్టణానికి చెందిన వారై ఉండాలి. 2023 అక్టోబర్ 1వ తేదీ నాటికి 18 ఏళ్ళ నిండి 35 సంవత్సరాలలోపు వయస్సు కలిగి ఉండాలి. నిబంధనల ప్రకారం రిజర్వేషన్లు వర్తిస్తాయి. క్రమశిక్షణతో మెలుగుతూ, నిజాయితీగా సేవ చేయదలిచిన నిరుద్యోగ యువతీ, యువకులు గ్రామ వలంటీర్ ఏపీ గవర్నమెంట్ ఇన్ వెబ్‌సైట్‌లోకి వెళ్లి దరఖాస్తు చేయవచ్చు. ఆధార్ నంబర్, విద్యార్హతల ధ్రువీకరణ పత్రాలు, కుల, నివాస ధృవీకరణ పత్రాలు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంది. అక్టోబర్ 27న దరఖాస్తులను పరిశీలిస్తారు. 28వ తేదీన మౌఖిక పరీక్ష ఉంటుంది. 30వ తేదీన వలంటీర్లుగా ఎంపికైన వారి వివరాలను తెలియజేస్తారు. అక్టోబర్ 31వ తేదీ నుంచి వలంటీర్లుగా పనిచేయటానికి ప్రభుత్వం అవకాశం కల్పిస్తుంది.

పలువురు డిప్యూటీ కలెక్టర్లు బదిలీ

ఒంగోలు అర్బన్: జిల్లాలో పలువురు డిప్యూటీ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు బదిలీ అయ్యారు. ఆ మేరకు ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. బదిలీ అయిన వారిలో సివిల్ సప్లయిస్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా ఉన్న పీ గ్లోరియాను పల్నాడు జిల్లాకు సివిల్ సప్లయిస్ ఎస్‌డీసీగా బదిలీ చేశారు. ల్యాండ్ ఎక్విజేషన్‌లో ఉన్న డిప్యూటీ కలెక్టర్ బీ నారదమునిని పల్నాడు జిల్లా పులిచెర్ల ప్రాజెక్టుకు బదిలీ చేశారు. అదేవిధంగా వెలిగొండ ప్రాజెక్టు స్పెషల్ కలెక్టర్‌గా జీ సువర్ణమ్మను నియమించారు. రామచంద్రపురం ఆర్డీవోగా పనిచేస్తున్న పీ సింధు సుబ్రహ్మణ్యంను మార్కాపురం ఆర్అండ్ఆర్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

కళారాల సంబరం భక్తఝురి అంబరం



అంకమ్మ పాలెం కాళికాదేవి కళారం

లోక రక్షకి అయిన ఆ ఆదిపరాశక్తి దానవ సంహారానికి కాళికామాత అవతారం దాల్చి భక్తుల కోరిక మేరకు తన ప్రతిరూపంగా ఇచ్చినట్లు భావించే కళారాలు దుర్గాష్టమి, మహార్నవమి రోజుల్లో ఒంగోలు పురవీధుల్లో దర్శనమిస్తాయి. దసరా ఉత్సవాల్లో మనకే ప్రత్యేకమైన ఈ కళారాల ఊరేగింపు.. వాటి విశిష్టత తెలుసుకుందాం..

- దసరా ఉత్సవాలకి మైసూర్ తర్వాత ఒంగోలు కళారాలు ప్రత్యేకత
- కోలాహలంగా కళారాల ఊరేగింపు
- వేలాదిగా తరలివచ్చిన భక్తజనం
- నేడు మూడు కళారాల ఊరేగింపు



ఆదివారం రాత్రి కనక దుర్గ కళారం నగరోత్సవం తిలకిస్తున్న ప్రజలు

ఒంగోలు మెట్రో:

దసరా శరన్నవరాత్రి మహోత్సవాల్లో రోజుకొక అలంకారంలో అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు ఎంతో ప్రాధాన్యత ఇస్తారు. అదేవిధంగా ఒంగోలు నగరంలో అర్ధరాత్రి పూట జరిగే కళారాల వేడుకలకు జిల్లా నలు వైపుల నుంచి ప్రజలు తరలివచ్చి భక్తిశ్రద్ధలతో వారి మొక్కులు తీర్చుకుంటారు. దసరా నవరాత్రుల్లో ముఖ్యమైన దుర్గాష్టమి సందర్భంగా ఆదివారం ఆలయాలన్నీ భక్తులతో కళకళలాడాయి. మహర్నవమి, విజయదశమి వేడుకలకు ముస్తాబయ్యాయి. ఆదివారం మూడు కళారాలు ఊరేగించగా, సోమవారం మరో మూడు కళారాలకు నగరోత్సవం నిర్వహించనున్నారు. మైసూర్ తర్వాత ఒంగోలుకే ఈ కళారాల ఉత్సవం ప్రత్యేకం.

వందేళ్లుగా...

ఒంగోలులో జరిగే కళారాల ఉత్సవానికి వందలాది సంవత్సరాల చరిత్ర ఉంది. అప్పట్లో చిన్న గూడు బండ్లు కట్టుకొని అమ్మవారి కళారాన్ని ఊరేగిస్తూ తప్పెట్లు వాయిస్తూ కాగడాలు పట్టుకొని అర్ధరాత్రి నుంచి నగరం మొత్తం తిరిగేవారు. తెల్లవారే వరకు ఈ సందడి కొనసాగేది. ఎంత రాత్రి అయినా సరే తమ వీధిలోకి వస్తున్న కళారాన్ని చూసి అమ్మవారికి కొబ్బరి కాయ కొట్టి, కర్పూర హారతులు సమర్పించి అమ్మవారి ఆశీస్సులు అందుకునేవారు. ఇప్పటి కాలంతోపాటు ఉత్సవ తీరులోనూ ఆధునికత చోటు చేసుకుంది. అదిరిపోయే డీజే, బాణాసంచా శబ్దాలతో దేవాలయాల నుంచి వీధుల్లోకి ఊరేగింపుగా వచ్చే అమ్మవారి కళారాన్ని దర్శిస్తే మళ్లీ ఏడాది వరకు ఎలాంటి దుష్ట శక్తుల పీడ, ఈతి బాధలు ఉండవని భక్తుల నమ్మకం.

కళారం అంటే...

ఒకసారి రక్తబీజుడు అనే రాక్షసుడితో అమ్మవారు యుద్ధం చేయవలసి వస్తుంది. అతని శిరస్సును ఖడ్గంతో ఖండిస్తుంది. రక్తం ధారలుగా నేల మీద కారుతుంది. ప్రతి రక్తపు చుక్క నుంచి మళ్లీ ఒక రక్త బీజుడు పుట్టుక వస్తాడు. బ్రహ్మదేవుడు ఆ రాక్షసుడికి ఇచ్చిన వరంతో అమ్మవారితో యుద్ధం చేస్తూ పోటీగా నిలబడతాడు. అమ్మవారు తన శక్తి నుంచి నల్లని కాళీ రూపాన్ని సృష్టించి కాళికాదేవిగా పెద్ద నాలుకతో రక్తబీజుడి నుంచి కారే ప్రతి రక్తపు బొట్టును భూమి మీద పడకుండా తాగేస్తూ ఆ రాక్షసుడి శక్తిని హరించి అంతం చేస్తుంది. అప్పుడు ప్రజలంతా కాళికా మాతకు జయ జయ ధ్వానాలు పలికి అమ్మవారిని తమ మధ్య ఉండిపోవాలని కోరగా దానికి అమ్మవారు ''అలా కుదరదు..ముల్లోకాల రక్షణ బాధ్యత నాదే కదా.. మీ కోరిక ప్రకారం ప్రజలందరికీ దుష్టశక్తుల భయం లేకుండా నా అంశంతో నిబిడీకృతమైన కళారాన్ని నోరు తెరిచి ఉన్న శిరస్సు భాగం ప్రసాదిస్తున్నాను. దాని రూపాన్ని పూజించి ఆరాధించండి. దసరా నవ రాత్రుల్లో దుర్గాష్టమి, మహార్నవమి రోజుల్లో అర్ధరాత్రి కళారాన్ని నగర సంచారం చేయించండి నగరంలోని దుష్టశక్తులన్నీ పారిపోతాయని'' అమ్మవారు అభయమిస్తుంది. విష్ణుమూర్తి తత్వమైన నరసింహ స్వామి కూడా కళారంగా వచ్చి మిమ్మల్ని తరింపచేస్తానని అమ్మవారు వరమిస్తుంది. ఆ విధంగా ప్రారంభమైనదే మన కళారాల చరిత్ర.

భక్తుల కొంగు బంగారం ఆరు కళారాలు..

ఒంగోలు మొత్తం ఆరు కళారాలు ఉన్నాయి. స్థానిక బాలాజీరావు పేటలో కనకదుర్గాదేవి, గంటాపాలెంలో పార్వతీదేవి, బీవీఎస్ హాల్ నల్లూరి నర్సింగ్ హోమ్ దగ్గర బాలా త్రిపుర సుందరీ దేవి, నరసింహ స్వామి, ఏనుగు చెట్టు దగ్గర ఉన్న అంకమ్మపాలెం కాళికాదేవి, కేశవ స్వామి పేటలోని మహిషాసుర మర్దిని కళారాలు ఉన్నాయి. నాలుగు కళారాలు పసుపు వర్ణంతో కాళికాదేవి ఎర్రగా, నరసింహస్వామి తెల్లగా ఉంటారు. కళారాల ఉత్సవం అద్భుత వీక్షణం దుర్గాష్టమి ఆదివారం రోజు అంకమ్మపాలెం కాళికాదేవి, బీవీఎస్ హాల్ నల్లూరి నర్సింగ్ హోమ్ దగ్గర బాలా త్రిపుర సుందరీ దేవి, బాలాజీరావుపేట లోని కనకదుర్గమ్మ నగర ఉత్సవానికి బయలుదేరాయి. నగరంలోని వేరువేరు మార్గాల్లో పయనించి సోమవారం తెల్లవారుజామున మస్తాన్ దర్గా సెంటర్కి చేరుకుంటాయి. సోమవారం మహిషాసుర మర్దిని, పార్వతీదేవి, నరసింహ స్వామి, కళారాల ఉత్సవం జరుగుతుంది.



మహిషాసుర మర్దిని కళారం




గంటాపాలెంలోని పార్వతీదేవి కళారం



బాలాజీ రావు పేటలో కనకదుర్గమ్మ కళారం



బీవీఎస్ హాల్ దగ్గర నరసింహస్వామి కళారం



బాలా త్రిపుర సుందరీ దేవి కళారం

తైక్వాండో చాంపియన్ షిప్ పోటీలకు ఎంపిక



తైక్వాండో పోటీలకు ఎంపికైన విద్యార్థులు

ఒంగోలు సెంట్రల్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తైక్వాండో చాంపియన్ షిప్ పోటీలకు జిల్లా నుంచి పాల్గొననున్న విద్యార్థుల ఎంపికలు ఆదివారం ఒంగోలులో నిర్వహించినట్లు జిల్లా తైక్వాండో అసోసియేషన్ సెక్రటరీ వైకే శ్రీనివాసరావు తెలిపారు. జిల్లాలో పలు ప్రాంతాల నుంచి 30 మంది విద్యార్థులు ఎంపికైనట్లు చెప్పారు. కాకినాడలో ఈనెల 29న 21వ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తైక్వాండో చాంపియన్ షిప్ పోటీలు జరుగుతున్నాయని చెప్పారు. ఎంపికకు కొండపి మండల కట్టావారిపాలెం, టంగుటూరు, ఒంగోలు, పేర్నమిట్ట, కొప్పోలు రోడ్ పరిసర ప్రాంతాల నుంచి విద్యార్థులు వచ్చినట్లు చెప్పారు. కొండపి నుంచి అద్దెపల్లి సత్యనారాయణ మన ఊరి వికాసం టీం , హ్యాపీ కిడ్స్ స్కూల్ పిల్లలు కూడ ఎంపికైనట్లు చెప్పారు.

క్లుప్తంగా

నేడు ఎస్పీ స్పందన రద్దు

ఒంగోలు సబర్బన్: జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ మలికగర్గ్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించాల్సిన స్పందన కార్యక్రమం రద్దయింది. విజయ దశమి పర్వదినాన్ని పురస్కరించుకుని స్పందనను రద్దు చేసినట్లు ఎస్పీ కార్యాలయ ప్రతినిధి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని ప్రజలు ఈ విషయాన్ని గుర్తించి సోమవారం ఎస్పీ కార్యాలయానికి రావద్దని సూచించారు.

'మేడ్' కమిటీల నియామకం



మాట్లాడుతున్న మేడ్ రాష్ట్ర అధ్యక్షుడు దేవపాల్

ఒంగోలు అర్బన్: మోడల్ అసోసియేషన్ ఆఫ్ దళిత్ ఎంప్లాయిస్(మేడ్) జిల్లా, నియోజకవర్గ నూతన కమిటీలను ఆదివారం ప్రగతిభవన్‌లోని ఏపీజీఈఎఫ్ జిల్లా కార్యాలయంలో ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మేడ్ రాష్ట్ర అధ్యక్షుడు మురికిపూడి దేవపాల్ నూతన కమిటీలను ప్రకటించారు. సంఘ జిల్లా అధ్యక్షుడిగా ఎండ్లూరి చిట్టిబాబును ఎంపిక చేశారు. జిల్లా కమిటీలో బుధాల శాంతికుమార్, యర్రగొండపాలేనికి ఆదిరాల పీటర్‌పాల్, బీరెల్లి దానయ్య, ఒంగోలుకు కొలకలూరి ప్రభాకర్, గద్దల మస్తాన్, కనిగిరికి చిరుగురి ప్రసాద్, కోలా సుధాకర్, కొండపికి కె.బాల కోటయ్య, ఆనంద్, గిద్దలూరుకు కె.సురేష్, కాకర్ల చందు, దర్శికి కె.విల్సన్, పందిటి అనిల్, మార్కాపురానికి బేతంబాబు, విడుదల సుమబాబి, ఒంగోలుకు అర్బన్ ఆదిములపు దివాకర్‌ను ఎంపిక చేసినట్లు వివరించారు.

చార్జీ సాధారణం

సర్వీసులు అదనం



- జిల్లాలోని ఐదు డిపోల నుంచి ఆన్‌లైన్‌లో వంద బస్సులు
- రానూపోను ఒకేసారి టికెట్ బుక్ చేసుకుంటే 10 శాతం రాయితీ
- ఏసీ బస్సుల్లో సీనియర్ సిటిజన్లకు 25 శాతం రాయితీ
- ప్రయాణికుల అవసరాలకు తగ్గట్లుగా అదనపు సర్వీసులు
- 50 శాతం అదనపు చార్జీలకు స్వస్తి



ఒంగోలు ఆర్టీసీ బస్టాండులో ప్రయాణికులు

ఒంగోలు:

పండగ వేళ పల్లెటూర్లు బంధుమిత్రుల పరివారంతో కళకళలాడుతున్నాయి. ఉపాధి నిమిత్తం వివిధ ప్రాంతాలకు వలస వెళ్లిన వారు తరలివస్తుండటమే అందుకు కారణం. ప్రజలను సురక్షితంగా గమ్య స్థానాలకు చేరుస్తూ వారి సంతోషంలో ప్రగతి రథ చక్రం భాగం పంచుకుంటోంది. గతంలో పండగ వచ్చిందంటే చాలు.. రిటర్న్ జర్నీ సాకు చూపుతూ 50 శాతం అదనపు దోపిడీ ఉండేది. ఇంకా చెప్పాలంటే సాధారణ బస్సులను సైతం ప్రత్యేక బస్సులుగా చూపించి డబ్బు దండుకోవడమే పనిగా ఉండేది. ఎక్స్‌ప్రెస్ స్పెషల్ బస్సుల చార్జీ సూపర్ లగ్జరీతో సమానంగా ఉండేది. ఇక ప్రైవేట్ ఆపరేటర్ల దోపిడీ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. పండగ వచ్చిందంటే చాలు డిమాండ్ సాకుతో ఇష్టం వచ్చినట్లుగా ఆన్‌లైన్‌లో టికెట్లు చూపించి మరీ ప్రయాణికులను భయభ్రాంతులకు గురిచేసేవారు. దీంతో పండగ వచ్చినా కుటుంబ సమేతంగా స్వస్థలాలకు వెళ్లలేని పరిస్థితి. ప్రైవేట్ వాహనాల సంగతి అటుంచితే ఆర్టీసీ మాత్రం పేదల రథ చక్రంగా మారిపోయింది.

50 శాతం అదనపు చార్జీలకు స్వస్తి

గతంలో ఆర్టీసీ 50 శాతం అదనపు చార్జీ వసూలు చేయడం, ప్రైవేటు ఆపరేటర్ల దోపిడీ అధికంగా ఉండటంతో సాధారణ ప్రజానీకం పల్లెల వైపు మొగ్గు చూపేందుకు వెనుకాడేవారు. వాస్తవానికి ఉమ్మడి ప్రకాశంలో కందుకూరు, కనిగిరి, ఒంగోలు నుంచి ఎక్కువగా ఉపాధి కూలీలు హైదరాబాద్, బెంగళూరు ప్రాంతాలకు వెళ్తుంటారు. వీరు దసరా పండగకు స్వస్థలాలకు కుటుంబ సమేతంగా చేరుకుని పదిరోజుల తర్వాత తిరిగి పట్టణాలకు వెళ్లేవారు. గత ప్రభుత్వంలో ఆర్టీసీ చార్జీల మోత మోగించడంతో ఎక్కువ మంది ఇంటికి రావడానికే వెనుకంజ వేశారు. ఇంకా చెప్పాలంటే గత ప్రభుత్వంలో ఏపీఎస్‌ఆర్టీసీ చార్జీలకన్నా తెలంగాణా ఆర్టీసీ చార్జీలు తక్కువుగా ఉండి ప్రయాణికులను ఆకర్షించడంలో కొంత ఇబ్బంది ఉండేది. కానీ ప్రస్తుతం ఒంగోలు నుంచి హైదరాబాద్‌కు తెలంగాణ ఆర్టీసీ రూ.790 వసూలు చేస్తుంటే అదే దూరానికి ఏపీఎస్‌ఆర్టీసీ రూ.600 మాత్రమే తీసుకుంటోంది. తెలంగాణ సర్వీసుల్లో జనరల్ పబ్లిక్, జర్నలిస్టులకు తప్ప మరో ఆప్షన్ లేదు. కానీ ఏపీఎస్‌ఆర్టీసీలో మాత్రం జనరల్ పబ్లిక్‌తోపాటు మరో నాలుగు రాయితీ ఆప్షన్లు ఉన్నాయి. జర్నలిస్టులకు 2/3వ వంతు రాయితీ, సీనియర్ సిటిజన్లకు ఏసీ సర్వీసుల్లో సైతం 25 శాతం రాయితీ ఇస్తున్నారు. ఇక ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగులను విభజించి వారికి ఏసీ బస్సుల్లో సైతం 50 శాతం రాయితీ బేసిక్ ఫేర్‌లో అందిస్తున్నారు.

ప్రైవేట్‌కు తగ్గిన డిమాండ్

గతంలో ఆర్టీసీ సర్వీసుల సంఖ్య తక్కువగా ఉండటంతో ప్రైవేట్ ఆపరేటర్ల హవా ఎక్కువగా ఉండేది. దీంతో డిమాండ్‌ను బట్టి రెట్టింపు చార్జీని వసూలు చేసేవారు. దీనిపై ప్రజల నుంచి తీవ్ర విమర్శలు రావడంతో రవాణా శాఖ అధికారులు రంగంలోకి దిగి చార్జీలు పెంచితే కఠిన చర్యలు తీసుకోవాల్సి వస్తుందంటూ హెచ్చరించారు. కానీ ప్రస్తుతం ఆ పరిస్థితి లేకుండా పోయింది. ఆర్టీసీ ఈనెల 24 నుంచి 29వ తేదీ వరకు 100 ప్రత్యేక బస్సులు నడపాలని నిర్ణయించింది. ఈ బస్సుల్లో గిద్దలూరు డిపో నుంచి 15, కనిగిరి నుంచి 28, మార్కాపురం నుంచి 13, ఒంగోలు నుంచి 28, పొదిలి డిపో నుంచి 16 బస్సులు నడిపేందుకు ఆర్టీసీ చర్యలు చేపట్టింది.

సామాజిక సేవే లక్ష్యంగా ఆర్టీసీ సేవలు

ఆదాయం కన్నా సామాజిక సేవే లక్ష్యంగా ఆర్టీసీ నేడు సేవలు అందిస్తోంది. పండగ రోజుల్లో 50 శాతం అదనపు చార్జీ వసూలు చేయడం వల్ల ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటుండటంతో ఆ విధానానికి స్వస్తి చెప్పాం. ప్రస్తుతం సాధారణ బస్సు అయినా, స్పెషల్ బస్సు అయినా ఒకటే రేటు వసూలు చేస్తున్నాం. రానూపోను ఒకేసారి టికెట్లు బుక్ చేసుకున్నవారికి 10 శాతం అదనపు రాయితీ ఇస్తున్నాం. సీనియర్ సిటిజన్లకు, ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగులకు ఏసీ బస్సుల్లోను 25 శాతం రాయితీ ప్రత్యేకంగా అందిస్తున్నాం. ఇంకా బస్సులు అదనంగా అవసరమైతే తగిన ఏర్పాట్లు చేస్తాం.

– బి.సుధాకర్, ప్రజా రవాణా శాఖ అధికారి

స్నానానికి దిగి తిరిగిరాని లోకాలకు..!

- నాగావళి నదిలో గల్లంతై బీటెక్ విద్యార్థి మృతి
- లక్కుపురంలో విషాదం



కెల్లూరి వెంకటనారాయణ మృతదేహం

బూర్జ : శ్రీకాకుళం జిల్లా బూర్జ మండలంలోని డొంకలపర్త పంచాయతీ ఏటిఒడ్డుపర్త (వైపర్త) గ్రామ సమీపంలో నాగావళి నదిలో గల్లంతై బీటెక్ విద్యార్థి మృతి చెందాడు. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ప్రకాశం జిల్లా పీసీపల్లి మండలం మర్రికుంటపల్లి గ్రామానికి చెందిన మృతి చెందిన కల్లూరి వెంకటనారాయణ (25) విజయవాడలోని కేఎల్ యూనివర్సిటీలో బీటెక్ తృతీయ సంవత్సరం చదువుతున్నాడు. దసరా సెలవులు కావడంతో శనివారం బూర్జ మండలంలోని లక్కుపురంలోని స్నేహితుల ఇంటికి వచ్చాడు. ఆదివారం ఉదయం స్నేహితులతో కలిసి ఏటిఒడ్డుపర్త వద్ద నాగావళి నదిలో స్నానానికి దిగాడు. ప్రమాదవశాత్తు గల్లంతయ్యాడు. స్నేహితులు భయాందోళనకు గురై గ్రామస్తులకు విషయం చెప్పడంతో అందరూ కలిసి వెతికారు. అయినా ఆచూకీ లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. స్థానిక పోలీసులు, పార్వతీపురం మన్యం జిల్లా అగ్ని మాపక కేంద్రం సిబ్బంది వచ్చి వెతకడంతో మృతదేహం లభ్యమైంది. వెంకటనారాయణకు తల్లిదండ్రులు, అక్కాచెల్లెలు ఉన్నారు. వీరిది వ్యవసాయ కుటుంబం. స్థానికులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏఎస్సై ఎం.వి.రమణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పాలకొండ ఏరియా ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

కరణం వెంకటేష్‌కు పలువురి పరామర్శ



కరణం బలరాంతో మాట్లాడుతున్న ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి



కరణం వెంకటేష్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు

ఒంగోలు టౌన్: రోడ్డు ప్రమాదంలో గాయపడి ఒంగోలు సంఘమిత్రలో చికిత్స పొందుతున్న వైఎస్సార్ సీపీ చీరాల నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేషను పలువురు ఆదివారం పరామర్శించారు. ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు, మాజీ మంత్రులు శిద్దా రాఘవరావు, పాలేటి రామారావు, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, పీడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ మాదాసి వెంకయ్య, నగర మేయర్ గంగాడ సుజాత, వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకుడు అమృతపాణి, వైఎస్సార్ సీపీ కొండపి ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు తదితరులు ఆస్పత్రికి వచ్చి వెంకటేషను పరామర్శించారు. ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి చీరాల ఎమ్మెల్యే కరణం బలరాంను కలిసి మాట్లాడారు. వెంకటేష్ ఆరోగ్య గురించి ఆరా తీశారు.

చీరాల, మార్టూరు, అద్దంకి, ఒంగోలు ప్రాంతాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, పలువురు అధికారులు వచ్చి వెంకటేష్‌ను పరామర్శించారు.

మంచి చేశాం.. ప్రజల్లోకి ధైర్యంగా వెళ్తున్నాం



లబ్ధిదారులకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

- మార్కాపురం ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి
- గోగినేనివారిపాలెం పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం

పొదిలి రూరల్: 'వైఎస్సార్ సీపీ అధికారం చేపట్టిన తర్వాత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి కులం, మతం, పార్టీ బేధం లేకుండా ప్రజలందరికీ మంచి చేశారు. అందుకే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ధైర్యంగా ప్రజల్లోకి వెళ్తున్నాం' అని మార్కాపురం ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి పేర్కొన్నారు. మూడో రోజు ఆదివారం సాయంత్రం పొదిలి మండలం ఉప్పలపాడు గ్రామ సచివాలయం పరిధిలోని గోగినేనివారిపాలెంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులకు స్థానికులు ఉలవా గోపి, సర్పంచ్ యేసేబు, బసవయ్య, ముసలయ్య, కొండలు, ఒక్కెయ్య ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే గడప గడపకు వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ.. సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. ప్రజలు తెలియజేసిన సమస్యలను నోట్ చేసుకుని వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మేనిఫెస్టోలో ప్రకటించిన పథకాలతోపాటు ప్రకటించని వాటిని సైతం సీఎం జగన్ అమలు చేస్తూ ప్రజల్లో మంచి పేరు తెచ్చుకున్నారన్నారు. ఏ గ్రామానికి వెళ్లినా ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందన్నారు. గత ప్రభుత్వానికి, ఈ ప్రభుత్వానికి తేడాను గమనించాలని ప్రజలను కోరారు. గత ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు కావాలంటే జన్మభూమి కమిటీల చుట్టూ ప్రదక్షిణ చేయాల్సి వచ్చేదని గుర్తు చేశారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో నవరత్నాలు పథకాలలో పేదలకు ఇళ్లు, ఇంటి స్థలాలు, వైఎస్సార్ రైతు భరోసా, సబ్సిడీపై విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ పనిముట్లు, అమ్మ ఒడి, విద్యాకానుక, వసతి దీవెన పథకాలు అర్హతే ప్రామాణికంగా అందిస్తున్నామన్నారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా సుపరిపాలన అందిస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోమారు ఆశీర్వదించాలని కోరారు.

కార్యక్రమంలో ఎంపీడీఓ పి.శ్రీకృష్ణ, ఈఓఆర్డీ కృష్ణ, పార్టీ రాష్ట్ర కార్యదర్శులు సానికొమ్ము శ్రీనివాసరెడ్డి, కేపీ రమణారెడ్డి, మండల, పట్టణ పార్టీ అధ్యక్షులు దుగ్గెంపూడి శ్రీనివాసరెడ్డి, నూర్జహాన్ బేగం, జేసీఎస్ కన్వీనర్ గొలమారి చెన్నారెడ్డి, కల్లం సుబ్బారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి జి.శ్రీనివాసులు, ఏఎంసీ మాజీ చైర్మన్ గుజ్జుల రమణారెడ్డి, వినోద్, కె.సుబ్బారావు, వార్డు అధ్యక్షులు, సచివాలయ కన్వీనర్లు, సర్పంచ్‌లు, అనుబంధ కమిటీల అధ్యక్షులు పాల్గొన్నారు.

వల్లూరమ్మను దర్శించుకున్న నటుడు గోపీచంద్



గోపీచంద్‌ను శేష వస్త్రాలతో సత్కరిస్తున్న ఈఓ, ఆలయ కమిటీ సభ్యులు

టంగుటూరు: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన వల్లూరమ్మ ఆలయంలో అమ్మవారిని సినీ నటుడు తొట్టెంపూడి గోపీచంద్ ఆదివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ కాలె శ్రీనివాసరావు, ఈఓ రమేష్, ప్రధాన అర్చకుడు నాగేశ్వరరావు, ఉప ప్రధాన అర్చకుడు ఉమాశంకర్ పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు, గోత్రనామార్చన నిర్వహించి, ఆలయ సంప్రదాయం ప్రకారం శేష వస్త్రాలతో సత్కరించారు. ఆలయం వెలుపల గోపీచంద్ విలేకర్లతో మాట్లాడుతూ.. వల్లూరమ్మ అమ్మవారిని ఏటా దర్శించుకుంటానని, నవరాత్రి ఉత్సవాల్లో ఆలయానికి రావడం చాలా సంతోషంగా ఉందన్నారు.

అదృష్ట పక్షి..

అంతరిస్తోందా?

- నల్లమల అభయారణ్యంలో క్రమేపీ కనుమరుగవుతున్న పాలపిట్టలు
- దసరా రోజున పాలపిట్టను వీక్షిస్తే శుభసూచకమంటున్న పండితులు
- మహా భారతంలో జమ్మిచెట్టు, పాలపిట్టపై ఆసక్తికర వర్ణన



పెద్దదోర్నాల: పాలపిట్ట శుభాలకు విజయాలకు చిహ్నం. విజయదశమి రోజున ఈ పిట్టను చూడగలటం ఎంతో అదృష్టంగా, శుభసూచకంగా ప్రజలు భావిస్తారు. దసరా పండగ వచ్చిందంటే జమ్మిచెట్టు ఎలా గుర్తుకొస్తుందో పాలపిట్ట కూడా అలాగే మనసులో మెదులుతుంది. గుప్పెడంత పరిమాణంలో ఉండే పాలపిట్ట చూడటానికి ఎంతో అందంగా, ముద్దుగా ఉంటుంది. ఇంతకీ దసరా పండగ నాడే పాలపిట్టను ఎందుకు చూడాలనేదానికి సంబంధించి మహాబారతంలో కొన్ని కథనాలు ఉన్నాయి. పూర్వం పాండవులు అరణ్య, అజ్ఞాతవాసాలను ముగించుకుని రాజ్యానికి తిరిగి వస్తుండగా పాలపిట్ట ఎదురు పడిందట. అప్పటి నుంచి పాండవులకు ఎన్నో అద్భుత విజయాలు సిద్ధించాయని మహాభారత కథనం. సాంస్కృతికంగా, పురాణాలపరంగా పాలపిట్టకు అంత ప్రాధాన్యత ఉంది కాబట్టే ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, బీహార్, ఒడిశా రాష్ట్రాల పక్షిగా వెలుగొందుతోంది. రాను రానూ పాలపిట్టల జాడ అంతరించిపోతుండటంతో దసరా పర్వదినం నాడు పట్టణాల్లో ఈ పక్షిని పంజరాల్లో ఉంచి చూపిస్తూ కొందరు డబ్బు సంపాదిస్తున్నారు.

రైతు నేస్తాలు.. ఏకపత్నీవ్రతులు!

పంట పొలాలు, పండ్ల తోటలు, మైదానాల్లో కలియతిరుగుతూ క్రిమికీటకాలను ఆహారంగా తీసుకునే పాలపిట్ట పరోక్షంగా అన్నదాతలకు లాభాన్ని చేకూరుస్తోంది. అందుకే దీనిని ఎకో ఫ్రెండ్లీ బర్డ్‌గా పిలుస్తారు. కొరార్సియస్ బెంగాలన్సిస్ దీని శాస్త్రీయ నామం. నీటిలో మునగడానికి ఎక్కువగా ఆసక్తి చూపే ఈ పక్షులు.. నీటిలో ఉన్న ఎటువంటి ఆహారాన్నైనా తేలికగా వేటాడగలుతాయి. 30 నుంచి 34 సెంటీమీటర్ల పొడవు మాత్రమే పెరిగు ఈ పక్షుల బరువు గరిష్టంగా 160 గ్రాములు మాత్రమే. వీటి రెక్కలు మాత్రం 64 నుంచి 75 సెంటీమీటర్ల మేర విచ్చుకుంటాయి.

మార్చి నుంచి జూన్ మధ్య కాలంలో సంతానోత్పత్తి ఉంటుంది. పాలపిట్టలు ఏక పత్నీ వ్రతులు. జీవితమంతా తాను కోరుకున్న మగ పక్షితోనే ఉంటాయి. ఆడపక్షిని మెప్పించేందుకు మగపక్షులు ఆకాశంలో చక్కర్లు కొడుతూ విన్యాసాలు చేస్తుంటాయి. ఈ కారణంగానే వీటిని ఇంగ్లిష్‌లో రోలర్ బర్డ్స్ అని పిలుస్తారు. ఇంతటి ప్రాముఖ్యత కలిగిన పాలపిట్టల సంచారం క్రమేపీ తగ్గిపోతుండటం ఆందోళన కలిగించే అంశం. నల్లమల అభయారణ్యంలోనూ పాలపిట్టల సంఖ్య తగ్గిపోతున్నట్లు శ్రీశైలం ప్రాజెక్టు ఎకోలాజికల్ పార్క్ బయాలజిస్ట్ రమేష్ చెబుతున్నారు.

జాతీయ రహదారిపై నిలిచిన ట్రాఫిక్



జాతీయ రహదారిపై టోల్‌ప్లాజా వద్ద నిలిచిన వాహనాలు

టంగుటూరు: 16వ జాతీయ రహదారి టంగుటూరు టోల్ ప్లాజా వద్ద సాంకేతిక లోపం వల్ల పెద్ద ఎత్తున ట్రాఫిక్ స్తంభించింది. దీంతో తూర్పు నాయుడుపాలెం వరకు వాహనాలు భారీగా నిలిచిపోయాయి. దూర ప్రాంతాల నుంచి నెల్లూరు వైపు వెళ్లే వాహనాల్లోని ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు తప్పలేదు. సుమారు సాయంత్రం 6:30 గంటల నుంచి 8:30 వరకు ఈ ట్రాఫిక్ కొనసాగింది. విషయం తెలుసుకున్న స్థానిక పోలీసులు, హైవే పోలీసులు చేరుకొని ట్రాఫిక్ను క్రమబద్ధీకరించారు. ఈ విషయమై టోల్ ప్లాజా మేనేజర్ సాంబయ్య వద్ద ప్రస్తావించగా... దసరా పండుగ సందర్భంగా వాహనాల రాక అధికమవడంతో సాంకేతిక సమస్య తలెత్తి ట్రాఫిక్ స్తంభించిందని తెలిపారు.

కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ జిల్లా కమిటీ ఏర్పాటు

ఒంగోలు అర్బన్: స్థానిక రెవెన్యూ భవన్‌లో ప్రకాశం జిల్లా కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ జిల్లా కమిటీని కొత్తగా ఏర్పాటు చేశారు. కమిటీ చైర్మన్‌గా పాణ్యంవేణు, జనరల్ సెక్రటరీగా పాలేటి మస్తాన్, ట్రెజరర్‌గా పాటిబండ్ల రవివర్మ, అసోసియేట్ చైర్మన్‌గా దూపాటి తిరుపతయ్యతో పాటు మరో 26 మందితో కలిపి జిల్లా నూతన జేఏసీని ఎన్నుకున్నారు. జిల్లాలో కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని నూతన జేఏసీ తెలిపింది. ఏపీ జేఏసీ అమరావతి అనుసంధానంగా కమిటీ పనిచేస్తుందని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అల్ల సురేష్ తెలిపారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఏపీ జేఏసీ అమరావతి జిల్లా చైర్మన్ కృష్ణమోహన్, కోశాధికారి డేనియల్ అభినందించారు.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
232	82
65,398	19,543

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (శుక్రవారం ముగింపు)

నాస్‌డాక్	12,984	▽ 202
డోజోన్స్	33,127	▽ 287
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,402	▽ 97
డాక్స్	14,798	▽ 247
షాంఘై	2,983	▽ 22
నికాయ్	31,259	▽ 171

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటి	82.43	84.10
£	బ్రిటన్ పౌండ్	ఒకటి	99.44	102.75
€	యూరో	ఒకటి	86.54	89.63
¥	జపాన్ ఎన్ (100)	ఒకటి	54.73	56.44
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఒకటి	51.55	53.84
S$	సింగపూర్ డాలర్	ఒకటి	59.70	61.63
SAR	సౌదీ రియాల్	పదింటికి	21.21	22.83
UAE D	యూఏఈ దిర్హామ్	పదింటికి	21.73	23.53
¥	చైనా యువాన్	పదింటికి	10.24	12.31

పాత బంగారం మార్చుకుంటున్నారా?

పండుగలు అంటే కేవలం ఖర్చు చేయడమే కాదు.. భవిష్యత్‌కు 'బంగారు'బాట వేసుకోవడం కూడా. నచ్చిన గృహోపకరణాలు, గ్యాడ్జెట్లు కొనే వారు, అందులో కొంత ఆదా చేసి భవిష్యత్ కోసం ఎందుకు ఇన్వెస్ట్ చేసుకోకూడదు? ఇలా ఆలోచించే కొందరు పండుగ సమయాల్లో బంగారం కొనుగోలు చేస్తుంటారు. బంగారం కేవలం అందాన్ని పెంచే ఆభరణం మాత్రమే కాదు, విలువను పెంచే ఆస్తి. అస్థిరతల్లో ర్యాలీ చేసే పెట్టుబడి సాధనం. కనుక పండుగ సమయాల్లో విలువ తరిగిపోయే వాటి కోసం వేలాది రూపాయలు ఖర్చు పెట్టేవారు.. పసిడికి కూడా ప్రాధాన్యం ఇవ్వాలన్నది నిపుణుల సూచన.



- ఆభరణం కోసమా.. పెట్టుబడి కోసమా?
- రెండింటికీ ఒక్కటే విధానం అనుకూలం కాదు
- అవసరమైతేనే కొత్త ఆభరణంతో మార్పిడి
- ఈ సమయంలో తయారీ, పన్నుల రూపంలో నష్టం
- పెట్టుబడి దృష్ట్యా మెరుగైన ప్రత్యామ్నాయాలు

గడిచిన కొన్నేళ్లలో బంగారం కొనుగోలు ఎన్నో మార్పులను సంతరించుకుంది. 20 ఏళ్ల క్రితం బంగారంపై పెట్టుబడి పెట్టే వారు అరుదుగా కనిపించే వారు. తర్వాత కాలంలో ఇందులో స్పష్టమైన మార్పు కనిపించింది. ముఖ్యంగా గడిచిన పదేళ్ల కాలంలో బంగారాన్ని పెట్టుబడి సాధనంగా అర్థం చేసుకోవడం పెరిగింది. గతంలో బంగారంపై పెట్టుబడి అంతా భౌతిక రూపంలోనే ఉండేది. ఇప్పుడు సార్వభౌమ పసిడి బాండ్లు (ఎస్‌జీబీలు), గోల్డ్ మ్యూచువల్ ఫండ్స్, గోల్డ్ ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్స్ (గోల్డ్ ఈటీఎఫ్‌లు) సాధనాలు అందుబాటులో ఉన్నాయి. అయినా, ఇప్పటికీ పెట్టుబడి దృష్ట్యా భౌతిక బంగారానికే ఎక్కువ మంది ప్రాధాన్యం ఇస్తున్నారు. ధంతేరస్ (ధనత్రయోదశి) వంటి ప్రత్యేక పర్వదినాల్లో పెద్ద ఎత్తున బంగారం కొనుగోళ్లు నమోదవుతుంటాయి. ఒక తరం నుంచి మరో తరానికి బదిలీ అయ్యే ఆస్తుల్లో బంగారానికి మొదటి స్థానం ఉంటుంది. నేటితరం పాత బంగారాన్ని, కొత్త ఆభరణాలతో మార్చుకోవడానికి ఆసక్తి చూపిస్తున్నారు. నిజానికి పాత బంగారం మార్పిడితో కొత్త ఆభరణాలు కొనుగోలు చేయడం సరైనదా..? ఆభరణాలను పెట్టుబడిగా చూడొచ్చా? పెట్టుబడి కోసం ఏ రూపంలో ఇన్వెస్ట్ చేయడం మెరుగు? ఈ విషయంలో నిపుణుల అభిప్రాయాలను ఎలా ఉన్నాయో పరిశీలిద్దాం.

బంగారం మార్పిడి విధానం..?

పాత బంగారు ఆభరణాలను మార్చుకోవడం వెనుక ఎన్నో కారణాలు ఉండొచ్చు. మార్కెట్లోకి వచ్చే కొత్త డిజైన్ల పట్ల ఆసక్తి ఏర్పడొచ్చు. పాత నగలు డ్యామేజ్ కావొచ్చు. లేదంటే కొత్త ఆభరణాలు కొనుగోలు చేసుకోవడానికి బడ్జెట్ లేక పాత వాటిని మార్చుకోవచ్చు. కారణం ఏదైనా.. పాత బంగారం మార్చుకునే క్రమంలో కొంత నష్టపోతున్నామనే విషయాన్ని అర్థం చేసుకోవాలి. పాత బంగారం ఆభరణాల మార్పిడికి సంబంధించి మన దేశంలో ప్రామాణిక విధానం అంటూ లేదు. వర్తకుల మధ్య వ్యత్యాసం కనిపిస్తుంది. ఆభరణం కొనుగోలు చేసిన వర్తకుడి వద్దే దాన్ని మార్చుకోవడం వల్ల గరిష్ఠ విలువను తిరిగి పొందడానికి అవకాశం ఉంటుంది. హాల్‌మార్క్ ఆభరణాలు అయితే బంగారం మార్కెట్ ధర మేర విలువను పొందొచ్చు. అయినా కానీ, ఆభరణాల తరుగు-తయారీ చార్జీలు అధికంగా ఉంటున్నాయి. బంగారం ధరలో 10-20 శాతం వరకు తరుగు, తయారీ చార్జీలను జ్యుయలరీ సంస్థలు వసూలు చేస్తున్నాయి. పాత ఆభరణాన్ని మార్చుకున్నప్పుడు అందులో తరుగు-తయారీ రూపంలో కొంత నష్టం ఏర్పడుతుంది. తిరిగి నూతన ఆభరణం కొనుగోలు చేయడం వల్ల, దాని తరుగు-తయారీ చార్జీల రూపంలో అదనంగా చెల్లించుకోవాల్సి వస్తుంది.

కొనుగోలు చేసిన వర్తకుడి నుంచి కాకుండా, వేరొక చోట పాత ఆభరణాన్ని మార్చుకునేట్టు అయితే ప్రక్రియ వేరుగా ఉంటుంది. వర్తకులు కొందరు కొన్ని అంశాల్లో ఏకరూప విధానాన్ని అనుసరిస్తుంటే, కొన్నింటి విషయాల్లో సొంత ప్రక్రియలను అమలు చేస్తున్నారు. పాత బంగారం ఆభరణాన్ని కరిగించి, స్వచ్ఛత చూసిన తర్వాత, కొత్త ఆభరణంతో మార్చుకోవడానికి చాలా సంస్థలు అనుమతిస్తున్నాయి. ''డిజిటల్ స్కేల్ సాయంతో బంగారం ఆభరణం బరువు చూస్తారు. దీని ఆధారంగా స్వచ్ఛతను బట్టి ధర నిర్ణయిస్తారు. సాధారణంగా అనుసరించే స్వచ్ఛతలు 24 క్యారట్ (99.9 శాతం స్వచ్ఛత), 22 క్యారట్ (91.6 శాతం స్వచ్ఛత), 18 క్యారట్ (75 శాతం స్వచ్ఛత). కొందరు జ్యుయలర్లు స్క్రాచ్ (గీయడం), యాసిడ్ టెస్ట్ ద్వారా బంగారం స్వచ్ఛతను నిర్ధారిస్తుంటారు''అని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ కమోడిటీస్ హెడ్ హరీశ్.వి తెలిపారు. అన్నింటికంటే ప్రామాణికమైనది హాల్‌మార్క్ స్వచ్ఛత విధానం. భారతీయ ప్రమాణాల మండలి (బీఐఎస్) హాల్‌మార్క్ సర్టిఫికేషన్ సేవలు అందిస్తోందని, హాల్‌మార్క్ గోల్డ్ స్వచ్ఛత పరంగా విశ్వసనీయమైనదిగా హరీశ్ పేర్కొన్నారు. ఇప్పుడు పెద్ద సంస్థలు అయితే క్యారట్‌ను కొలిచే మెషీన్లను ఉపయోగిస్తున్నాయి. వీటినే గోల్డ్ అనలైజర్ మెషీన్లు అంటున్నారు. అందులో బంగారం లేదా ఆభరణాన్ని ఉంచితే బరువు ఎంత, ప్యూరిటీ ఎంత అనే వివరాలను ప్రదర్శిస్తాయి. ఉదాహరణకు వడోదరకు చెందిన రీనా దంపతులు ఎదుర్కొన్న అనుభవాన్ని తెలుసుకుంటే పాత బంగారం మార్పిడి ఇప్పుడు ఎంత సులభంగా మారిందో అర్థం చేసుకోవచ్చు. వీరివద్దనున్న 20 గ్రాముల బంగారం చైన్ తెగిపోగా, 2014లో మార్చుకుందామని అనుకున్నారు. ఓ జ్యుయలర్ వద్దకు వెళితే, కంటితో చూసి 18 క్యారట్ల బంగారం అని ఖరారు చేసి, రూ.37,500 ధర చెల్లిస్తానని చెప్పాడు. అప్పుడు 10 గ్రాముల బంగారం ధర రూ.25,000 స్థాయిలో ఉంది. దీంతో వారు మార్చుకోలేదు. ఇటీవలే అదే చైన్‌ను ఓ వర్తకుడి వద్దకు తీసుకెళ్లగా, గోల్డ్ అనలైజర్ మెషీన్‌లో పెట్టి చూశారు. 22 క్యారెట్ల ప్యూరిటీ ఉన్నట్టు చూపించింది. దాన్ని కరిగించిన తర్వాత అసలు విలువ చెబుతానని అనడంతో, అందుకు రీనా దంపతులు ఒప్పుకున్నారు. కరిగించిన తర్వాత కూడా 22.1 క్యారెట్ నిర్ధారణ అయింది. దాంతో 10 గ్రాములకు రూ.61,000 చొప్పున విలువ కట్టారు. కొత్త ఆభరణం ధర కూడా అదే రీతిలో ఉండడంతో వారు మార్చుకునేందుకు సమ్మతించారు.

మార్చుకుంటే ఎంత కోల్పోవచ్చు..?		
	పాత ఆభరణం	కొత్త ఆభరణం
బరువు	20గ్రాములు	20 గ్రాములు
ధర (10 గ్రా.)	రూ.60,000 (సుమారు)	రూ.60,000
తరుగు-తయారీ చార్జీలు	లేవు	15 శాతం
పన్ను	వర్తించదు	3 శాతం
మొత్తం ధర	1,20,000	1,41,600

మార్చుకోవడం వల్ల కోల్పోయేది రూ.21,600

కొత్త ఆభరణాల కొనుగోలు

బంగారం కూడా ఒక ఆస్తే. ఎవరి పెట్టుబడుల పోర్ట్‌ఫోలియోకైనా ఇది విలువను పెంచుతుంది. ఆభరణం కోసం కొంటున్నారా? లేక పెట్టుబడి దృష్ట్యా కొంటున్నారా? అన్న స్పష్టత అవసరం. భౌతిక బంగారం, ఆభరణాల రూపంలో ఇన్వెస్ట్ చేసుకునేట్టు అయితే తరుగు-తయారీ చార్జీలు, దానిపై జీఎస్‌టీ చార్జీలు చెల్లించాల్సి వస్తుంది. స్వచ్ఛతకు సంబంధించిన సమస్యలు కూడా ఉంటాయి. నేడు చాలా జ్యుయలరీ సంస్థలు తమ వద్దే విక్రయిస్తే 100 శాతం విలువను చెల్లిస్తున్నాయి. ఒకవేళ ఆభరణంతో మార్చుకోకుండా, నగదు కోరితే మొత్తం విలువలో 5 శాతం వరకు తగ్గించి ఇస్తున్నాయి. పన్ను కోణంలో ఇలా చేస్తున్నాయి. ''జ్యుయలరీ అనేది సెంటిమెంటల్. మనోభావాలతో ఉంటుంది. ఒక తరం నుంచి ఇంకో తరానికి బదిలీ అవుతుంటుంది. అయితే అధిక తరుగు-తయారీ చార్జీల (10-20 శాతం)తో మార్చుకునేందుకు అయ్యే వ్యయం ఎక్కువ. దీనికితోడు జ్యుయలరీ కోసం స్టోరేజ్, లాకర్ చార్జీలను కూడా చెల్లించుకోవాల్సి రావచ్చు. భౌతిక బంగారం అయినా, ఆభరణాలు అయినా అవి వ్యక్తిగత ఆస్తులు. ఒక ఇన్వెస్టర్ పెట్టుబడుల విలువకు తోడు కావు. పెట్టుబడి కోసం అయితే బంగారం కడ్డీలు లేదా కాయిన్లను కొనుగోలు చేయడం కాస్త మెరుగైనది'' అని సెబీ నమోదిత ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజర్ దిల్షద్ బిల్లిమోరియా సూచించారు. అయితే బంగారం కాయిన్లు, కడ్డీలను తిరిగి విక్రయించే సమయంలో సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆమె అంటున్నారు. ''బ్యాంక్‌లు కాయిన్లు, కడ్డీలను విక్రయించడమే కానీ, వెనక్కి తీసుకోవడం లేదు. దీంతో వీటిని బయట విక్రయించుకోవాల్సి వస్తుంది. తరుగు, కరిగించేందుకు చార్జీలను ఆ సమయంలో వసూలు చేస్తున్నారు''అని బిల్లిమోరియా వివరించారు.

ఏమిటి మార్గం..?

ద్రవ్యోల్బణం ప్రభావాన్ని కాచుకునే చక్కని హెడ్జింగ్ సాధనం బంగారం అని నిపుణులు చెబుతున్నారు. బంగారంలో ఇన్వెస్ట్ చేయడం వల్ల ఎవరి పోర్ట్‌ఫోలియోలో అయినా వైవిధ్యం ఏర్పడుతుందని అంటున్నారు. కాకపోతే పెట్టుబడి దృష్ట్యా అయితే ఆభరణాల కంటే మెరుగైన ప్రత్యామ్నాయాలను పరిశీలించాలన్నది నిపుణుల సూచన. గోల్డ్ ఈటీఎఫ్‌లు, ఎస్‌జీబీలు, గోల్డ్ మ్యూచువల్ ఫండ్స్‌ను ఇందుకు నిదర్శనంగా పేర్కొంటున్నారు. ''చారిత్రకంగా చూస్తే బంగారం ధరలు ఆర్థిక పరిస్థితులకు అనుగుణంగా సగటున ఏటా 5-11% మధ్య వృద్ధి చెందాయి. ద్రవ్యోల్బణం పెరిగే సమయంలో గోల్డ్ చక్కని హెడ్జింగ్ సాధనం. పెట్టుబడుల వైవిధ్యం దృష్ట్యా బంగారం ఒక మంచి పెట్టుబడి సాధనం అవుతుంది. అయితే అది కడ్డీలు లేదా జ్యుయలరీ రూపంలో ఉండకూడదు'' అని బిల్లిమోరీ సూచించారు. పీపీఎఫ్, కార్పొరేట్ ఫిక్స్‌డ్ డిపాజిట్లు వంటి సాధనాలు బంగారం మాదిరే వైవిధ్యానికి తోడు, మెరుగైన రాబడి, లిక్విడిటీతో ఉంటాయని చెప్పారు. కనుక పాత బంగారం మార్పిడి అనేది అవసరం ఆధారంగానే నిర్ణయించుకోవాలి. ఉపయోగించని ఆభరణాలను మార్చుకుని కొత్తవి తీసుకోవడం మంచి నిర్ణయం అవుతుంది. పెట్టుబడి కోసం అయితే ఆభరణాలకు బదులు నిపుణులు సూచించిన ప్రత్యామ్నాయాలను పరిశీలించడం మేలు. దీని వల్ల బంగారం విలువలో నష్టపోయే అవకాశం ఉండదు. 2010 వరకు బంగారం విలువ 10 గ్రాములు రూ.15,000 స్థాయిలోనే ఉండేది. కనుక పెట్టుబడుల దృష్ట్యా భౌతిక బంగారాన్ని పెద్ద మొత్తంలో కొనుగోలు చేసే వారు. కానీ, నేడు ధర గణనీయంగా పెరిగిపోవడంతో, పెట్టుబడి కోణంలో డిజిటల్ బంగారం సాధనాలకు ప్రాధాన్యం పెరుగుతోంది.



కొనుగోలు మార్గాలు.. చార్జీలు.. రిస్కులు				
సాధనం	కొనుగోలు మార్గం	రిస్క్	చార్జీలు	కనీస పెట్టుబడి
భౌతిక బంగారం	ఆభరణాలు, కాయిన్లు, కడ్డీలు	జాగ్రత్తగా కాపాడుకోవడం	లాకర్, తయారీ, ఇన్సూరెన్స్ వ్యయాలు	ఒక గ్రాము విలువ
డిజిటల్ గోల్డ్	యాప్స్ సాయంతో	నియంత్రణ, పర్యవేక్షణ లేదు	జీఎస్‌టీ పన్ను	రూపాయి నుంచి
గోల్డ్ ఈటీఎఫ్‌లు	షేర్ల మాదిరే, స్టాక్ ఎక్ఛేంజీల నుంచి	ధరల్లో రోజువారీ హెచ్చుతగ్గులు	ఫండ్ ఎక్స్‌పెన్స్ రేషియో, డీమ్యాట్ ఏఎంసీ చార్జీలు, బ్రోకరేజ్	ఒక గ్రాము నుంచి
గోల్డ్ మ్యూచువల్ ఫండ్స్	ఏఎంసీల నుంచి, బ్రోకర్ల నుంచి	ఈటీఎఫ్‌ల మాదిరే	0.6-1.20 శాతం	రూ.100 నుంచి
ఎస్‌జీబీలు	ప్రభుత్వ, ప్రైవేటు బ్యాంక్‌లు, బ్రోకర్ల సాయంతో	దాదాపుగా లేనట్టే	చార్జీల్లేవు, పైగా పెట్టుబడి విలువపై ఏటా 2.5 శాతం రాబడి	రూ.5,000 నుంచి

కొటక్ బ్యాంక్ లాభం అప్

క్యూ2లో రూ. 4,423 కోట్లు



న్యూఢిల్లీ: ప్రయివేట్ రంగ కొటక్ మహీంద్రా బ్యాంక్ ఈ ఏడాది (2023-24) రెండో త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. జులై-సెప్టెంబర్ (క్యూ2)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 24% జంప్‌చేసి రూ. 4,423 కోట్లను తాకింది. వడ్డీ ఆదాయం పుంజుకోవడం ఇందుకు దోహదపడింది. స్టాండెలోన్ లాభం సైతం రూ. 2,581 కోట్ల నుంచి రూ. 3,191 కోట్లకు ఎగసింది. నికర వడ్డీ ఆదాయం 21% వృద్ధితో రూ. 6,297 కోట్లకు చేరింది. నికర వడ్డీ మార్జిన్లు 5.22 శాతాన్ని తాకాయి. ఇతర ఆదాయం రూ. 1,832 కోట్ల నుంచి రూ. 2,314 కోట్లకు పుంజుకుంది. స్థూల మొండిబకాయిలు(ఎన్‌పీఏలు) 2.08% నుంచి రూ. 1.72%కి తగ్గాయి.

అశోక్ వాశ్వానికి సై: కొటక్ మహీంద్రా బ్యాంక్ కొత్త ఎండీ, సీఈవోగా బయటి వ్యక్తి అశోక్ వాస్వాని ఎంపికకు ఆర్‌బీఐ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. బ్యాంక్ వ్యవస్థాపకుడు ఉదయ్ కొటక్ నాలుగు నెలల ముందుగానే ఎండీ, సీఈవో బాధ్యతల నుంచి వైదొలగుతున్న నేపథ్యంలో అశోక్‌ను బ్యాంక్ బోర్డు ప్రతిపాదించింది.

ఐసీఐసీఐ బ్యాంక్ లాభం జూమ్

క్యూ2లో రూ. 10,896 కోట్లు



న్యూఢిల్లీ: ప్రయివేట్ రంగ దిగ్గజం ఐసీఐసీఐ బ్యాంక్ ఈ ఆర్థిక సంవత్సరం (2023-24) రెండో త్రైమాసికంలో ఆకర్షణీయ ఫలితాలు సాధించింది. జులై-సెప్టెంబర్ (క్యూ2)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 36% జంప్‌చేసి రూ. 10,896 కోట్లను తాకింది. ప్రొవిజన్లు తగ్గడం, వడ్డీ ఆదాయం పుంజుకోవడం ఇందుకు దోహదపడింది. స్టాండెలోన్ లాభం సైతం రూ.7,558 కోట్ల నుంచి రూ. 10,261 కోట్లకు ఎగసింది. మొత్తం ఆదాయం రూ. 31,088 కోట్ల నుంచి రూ. 40,697 కోట్లకు దూసుకెళ్లింది. నికర వడ్డీ ఆదాయం 24 శాతం వృద్ధితో రూ. 18,308 కోట్లకు చేరింది. నికర వడ్డీ మార్జిన్లు 4.31 శాతం నుంచి 4.53 శాతానికి బలపడ్డాయి. ట్రెజరీ మినహా వడ్డీయేతర ఆదాయం 14 శాతం అధికమై రూ. 5,861 కోట్లయ్యింది.

ఎన్‌పీఏలు డౌన్...

తాజా సమీక్షా కాలంలో ఐసీఐసీఐ బ్యాంక్ స్థూల మొండిబకాయిలు(ఎన్‌పీఏలు) 3.19 శాతం నుంచి రూ. 2.48 శాతానికి తగ్గాయి. కనీస మూలధన నిష్పత్తి(సీఏఆర్) 16.07 శాతంగా నమోదైంది.

స్టాక్స్ వ్యూ

రామ్‌కో సిమెంట్స్	షేర్‌ఖాన్	కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 991   టార్గెట్: రూ. 1,130



ఎందుకంటే: ప్రయివేట్ రంగ కంపెనీ రామ్‌కో సిమెంట్స్ దక్షిణాదిలో సగటు సిమెంట్ ధరల వేగవంత పెరుగుదల, ఈ ఏడాది(2023-24) రెండో త్రైమాసికం (క్యూ2) తదుపరి ఇంధన వ్యయాలు తగ్గడం వంటి అంశాల కారణంగా లబ్ధి పొందే అవకాశముంది. దక్షిణాదిలో సగటు సిమెంట్ ధరలు అక్టోబర్ 5 నుంచి ఒక్కో బ్యాగుకి సుమారు రూ. 40 చొప్పున ఎగశాయి. వెరసి క్యూ2(జులై-సెప్టెంబర్)తో పోలిస్తే సిమెంట్ ధరలు 10 శాతం అధికంగా లభించనున్నాయి. సీజనల్‌గా ఈ ఆర్థిక సంవత్సరం క్యూ2 బలహీన కాలం అయినప్పటికీ బలమైన డిమాండ్ కనిపించింది. ఈ ట్రెండ్ పూర్తి ఏడాదిలోనూ కొనసాగే అంచనాలున్నాయి. పూర్తి ఏడాదికి సిమెంట్ అమ్మకాల పరిమాణంలో 20 శాతం వార్షిక వృద్ధిని కంపెనీ అంచనా వేస్తోంది. ఈ నెలలో అంతర్జాతీయ కోల్, దేశీ పెట్ కోక్ ధరలు నెలవారీగా చూస్తే 13-5 శాతం చొప్పున క్షీణించాయి. మరోవైపు ప్రాంతాలవారీగా సిమెంట్ ధరలు బలపడటంతో నిర్వహణ లాభాలు మరింత పుంజుకునేందుకు వీలుంది. నాన్‌ట్రేడ్ విభాగంపై కంపెనీ ప్రత్యేక దృష్టి సారించడం, అధిక ధరల ఉత్పత్తులు(ప్రీమియమైజేషన్), వ్యయ నిర్వహణా సామర్థ్యాలు, సిమెంటు విక్రయాలలో గరిష్ట ధరలను పొందడం, కొనసాగుతున్న పటిష్ట డిమాండు వంటి అంశాలు కంపెనీ నిర్వహణ లాభం, నికర లాభాలను భారీగా మెరుగుపరిచే అవకాశముంది. దీంతో కంపెనీ ఆర్జనలు పుంజుకోనున్నాయి. ఇది కంపెనీ రీరేటింగ్‌కు దారితీయవచ్చని భావిస్తున్నాం.

హిందాల్కో	మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్	కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 473   టార్గెట్: రూ. 570



ఎందుకంటే: అల్యూమినియం తయారీ దిగ్గజం హిందాల్కో ఇండస్ట్రీస్‌కు ఒడిషాలోని హీరాకుడ్, ఆదిత్య ప్లాంట్లను ఇటీవలే సందర్శించాం. తద్వారా ఆదిత్య బిర్లా గ్రూప్ కంపెనీ మెటల్ తయారీ విధానాలు, కార్యకలాపాలను పరిశీలించాం. ఆదిత్య స్మెల్టర్ ప్లాంటు ప్రపంచంలోనే చౌక వ్యయాల, అత్యంత సమర్థవంతమైన యూనిట్లలో ఒకటిగా నిలుస్తోంది. అత్యంత ఆటోమేటిడ్ విధానంలో ఏర్పాటైన ఈ యూనిట్ కార్యకలాపాల నియంత్రణలో అతిఎక్కువ టెక్నాలజీతోపాటు, క్రేన్లు తదితరాలను వినియోగిస్తోంది. డౌన్‌స్ట్రీమ్‌లో ముడిసరుకులకు సంబంధించి ఫైబర్ రీఇన్‌ఫోర్స్‌డ్ పాలిమర్స్(ఎఫ్ఆర్‌పీ) విస్తరణపై ప్రత్యేక దృష్టిని సారిస్తోంది. తద్వారా లాభదాయకతను మరింత మెరుగుపరచుకునేందుకు వీలుంటుంది. ఇది వ్యయాల ప్రభావిత(ఆదా) సమీకృత విధానంలో భాగంకాగా.. సొంత హాట్ మిల్ సామర్థ్యం ద్వారానే ఎఫ్ఆర్‌పీ ప్రొడక్టులను రూపొందించుకోగలుగుతోంది. అత్యున్నత ఆటోమేషన్, టెక్నాలజీ వినియోగంతో పాటు.. తయారీ విధానంలో ప్రతీ చోటా వ్యయాల ఆదాకు మరింతగా ప్రయత్నిస్తోంది. తయారీలో అత్యంత రక్షణాత్మక చర్యలను అనుసరిస్తోంది. సామర్థ్యాన్ని గరిష్ఠంగా వినియోగించుకునే బాటలో సిమ్యులేషన్ ఆధారిత శిక్షణా విధానాలను అవలంబిస్తోంది. పటిష్ట బ్యాలన్స్‌షీట్ కలిగిన కంపెనీ అంతర్గత వనరుల ద్వారానే విస్తరణ సంబంధ పెట్టుబడి వ్యయాలను సమకూర్చుకుంటోంది. అత్యంత సమీకృత కార్యకలాపాలు కలిగిన కంపెనీ డౌన్‌స్ట్రీమ్ సామర్థ్య విస్తరణ ద్వారా లాభాలను భారీగా పెంచుకునే ప్రణాళికలు అమలు చేస్తోంది.

గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు, సూచనలు, వివిధ బ్రోకరేజ్ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే

పిల్లల ఉన్నత విద్యకు అనుకూల సాధనాలు?

Q & A



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్

మార్కెట్లలో అస్థిరతలను ఇన్వెస్టర్లు అధిగమించడం ఎలా?
– కిరణ్

అస్థిరతలనేవి ఈక్విటీల సహజ లక్షణం. ఆర్థిక పరిస్థితులకు అనుగుణంగా చలిస్తుంటాయి. గడిచిన ఐదు, పదేళ్లుగా మార్కెట్లలో ఇదే ధోరణి కనిపిస్తోంది. ఇన్వెస్టర్లు వీటిని ఎదుర్కోడం ఎలా అన్నది తెలుసుకోవాలి. ఇందుకోసం కొన్ని చర్యలను అమలు చేయాల్సి ఉంటుంది. ముందుగా ప్రతీ ఇన్వెస్టర్ లైఫ్ ఇన్సూరెన్స్, హెల్త్ ఇన్సూరెన్స్ ప్లాన్లను తీసుకుని తమకు, తమ కుటుంబ సభ్యులకు రక్షణ కల్పించుకోవాలి. అత్యవసర సందర్భాల్లో ఈక్విటీ పెట్టుబడులను కదిలించకుండా ఉండాలి. ఇందుకోసం ప్రత్యేకంగా అత్యవసర నిధిని (ఈఎఫ్) ఏర్పాటు చేసుకోవాలి. ఈక్విటీల్లో మీ పెట్టుబడులను కనీసం ఐదు నుంచి ఏడేళ్ల పాటు కదపకూడదు. ఈక్విటీ అస్థిరతలను అధిగమించేందుకు ఈ చర్యలు అవసరం. అలాగే, సిప్ వంటి సాధనాల ద్వారా ఇన్వెస్ట్ చేయడం వల్ల మార్కెట్ అస్థిరతల నుంచి ప్రయోజనాన్ని పొందొచ్చు. సిప్ రూపంలో క్రమం తప్పకుండా ఇన్వెస్ట్ చేసే వారికి మార్కెట్లలో కరెక్షన్లు మంచి అవకాశాలను తెస్తాయి. ఎందుకంటే ఆ సమయాల్లో ఎక్కువ ఫండ్ యూనిట్లను తక్కువ ధరకే సమకూర్చుకోవచ్చు. మార్కెట్లు దిద్దుబాటుకు గురైతే చౌకగా కొనుగోలు చేయడానికి అవకాశం ఉంటుంది. కానీ, మీడియాలో వచ్చే గందరగోళ సమాచారం ఇన్వెస్టర్లను నిరాశకు, అయోమయానికి, భయానికి గురి చేస్తుంది. దాంతో వారు ప్రతికూల సమయాల్లో పెట్టుబడులు చేయడానికి వెనుకాడుతుంటారు. పైగా కొందరు అమ్మకాలు కూడా చేస్తుంటారు. ఇదే అతిపెద్ద తప్పు. ఆ సమయంలో తప్పకుండా సిప్‌ను కొనసాగించాలి. వీలైతే సిప్ మొత్తాన్ని పెంచుకోవాలి. దీనివల్ల దీర్ఘకాలంలో మరిన్ని రాబడులు సమకూర్చుకోడానికి వీలుంటుంది.

నాకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. వారి వయస్సు పదేళ్లలోపే ఉంటుంది. వారి ఉన్నత విద్య కోసం ఏకమొత్తంలో ఇన్వెస్ట్ చేయాలని అనుకుంటున్నాను. ఇందుకు అనుకూల సాధనాలు ఏవి?
– విజయశ్రీ

పిల్లల విద్య కోసం ఏక మొత్తంలో ఎక్కడ ఇన్వెస్ట్ చేయాలి?.. చాలా మంది తల్లిదండ్రులు సాధారణంగా ఎదుర్కొనే సందేహం ఇది. ప్రాపర్టీ విక్రయం లేదా బోనస్ లేదా తాతలు తమ మనవళ్లు, మనవరాళ్ల కోసం నగదు బహుమతి ఇచ్చినప్పుడు.. ఆ మొత్తాన్ని పిల్లల భవిష్యత్తు కోసం ఇన్వెస్ట్ చేయాలని చాలా మంది తల్లిదండ్రులు భావిస్తారు. ఇందుకోసం పలు మార్గాలు ఉన్నాయి. సాధారణంగా ఈ మొత్తాన్ని పిల్లల ఉన్నత విద్య కోసం ఇన్వెస్ట్ చేయాలని అనుకుంటే అందుకు, సాధారణంగా పదేళ్ల కాల వ్యవధి ఉంటుంది. అటువంటప్పుడు ఈక్విటీలకు మించి మెరుగైన సాధనం లేదనే చెప్పాలి. ఈక్విటీల్లోనూ ఫ్లెక్సీక్యాప్ విభాగం అనుకూలంగా ఉంటుంది. ఎందుకంటే ఫ్లెక్సీక్యాప్ పథకాలు పెట్టుబడులను వైవిధ్యం ఉండేలా చూస్తాయి. అన్ని రంగాల పరిధిలో, భిన్న మార్కెట్ క్యాప్ కలిగిన (డైవర్సిఫైడ్) కంపెనీల్లో ఫండ్ మేనేజర్ పెట్టుబడులు పెడతారు.

ఒకవేళ పన్ను ప్రయోజనం కూడా కోరుకుంటే ఈక్విటీ లింక్డ్ సేవింగ్స్ స్కీమ్ (ఈఎల్ఎస్ఎస్)ను ఎంపిక చేసుకోవచ్చు. ఇవి కూడా ఫ్లెక్సీక్యాప్ మాదిరే పనిచేస్తుంటాయి. అన్ని రంగాలకు చెందిన కంపెనీల్లో పెట్టుబడులు పెట్టడం ద్వారా రిస్క్ తగ్గించే విధంగా ఈఎల్ఎస్ఎస్ పథకాల పనితీరు ఉంటుంది. ఈ పథకాల్లో ఒక ఆర్థిక సంవత్సరంలో రూ.1.5 లక్షలు ఇన్వెస్ట్ చేయడం ద్వారా సెక్షన్ 80సీ కింద పన్ను ప్రయోజనం పొందొచ్చు. ఫ్లెక్సీక్యాప్ ఫండ్స్ ఐదేళ్ల కాలంలో సగటున 12 శాతానికి పైనే వార్షిక రాబడులు ఇచ్చాయి. ఈ రాబడి రేటు ప్రకారం ఎవరైనా రూ.లక్షను పదేళ్ల కాలానికి ఇన్వెస్ట్ చేస్తే.. రూ.3.14 లక్షలు సమకూరుతుంది. ఈక్విటీల్లో అస్థిరతలు సహజంగా ఉంటాయి. కనుక ఫ్లెక్సీక్యాప్ పథకాల్లోనూ ఇదే కనిపిస్తుంది. అందుకనే ఈక్విటీల్లో ఏక మొత్తంలో ఇన్వెస్ట్ చేయడం కాకుండా, తమ దగ్గరున్న పెట్టుబడులను కొన్ని విడతలుగా ఇన్వెస్ట్ చేసుకోవాలి. మీ దగ్గర ఉన్న ఏక మొత్తాన్ని ఏదైనా డెట్ ఫండ్‌లో ఇన్వెస్ట్ చేసి.. దాని నుంచి ప్రతి నెలా సిస్టమ్యాటిక్ ట్రాన్స్‌ఫర్ ప్లాన్ (ఎస్‌టీపీ) రూపంలో ఈక్విటీ పథకాల్లోకి మళ్లించుకోవాలి. మూడేళ్ల కాలంలో దీన్ని పూర్తి చేయాలి. దీనివల్ల మార్కెట్ల ర్యాలీ, కరెక్షన్లలోనూ ఇన్వెస్ట్ చేసినట్టు అవుతుంది.